AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## 13న ఎల్లారెడ్డిలో మహిళలకు ముగ్గుల పోటీలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 13న ఎల్లారెడ్డిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ముగ్గుల పోటీలకు అనువైన స్థలం కోసం బస్సు డిపో ప్రాంగణాన్ని పరిశీలించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలో పెద్దఎత్తున ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ తానాజీ, ఆదిమూలం సతీష్, పృథ్వీరాజ్, ఇమ్రాన్, బర్కత్, శ్రావణ్, సాయిలు తదితరులు ఉన్నారు.






# పేరుపై దుమారం

- నిజామాబాద్‌ను ఇందూరుగా మారుస్తామన్న బీజేపీ
- వ్యతిరేకిస్తున్న మైనార్టీ వర్గాలు
- మున్సిపల్ ఎన్నికలవేళ ఆసక్తికర చర్చ

**రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. బల్దియా పీఠాలను గెలుచుకోవడానికి అన్ని పార్టీలు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఇందులో భాగంగా ఆయా పార్టీలు ఇప్పటి నుంచే ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డాయి. నాయకులు మాటలతూటాలు వదులుతున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల నిజామాబాద్ పేరు మార్పుపై ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలు చేయగా.. జిల్లాలో తీవ్ర దుమారం చెలరేగింది. బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం మధ్య మాటలు యుద్ధం మొదలైంది.**

**- అక్షరటుడే, ఇందూరు**

నిజామాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. మేయర్ పీఠం కైవసం చేసుకునేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఓవైపు అభ్యర్థుల ఎంపికలో బిజీగా ఉంటూనే.. మరోవైపు గెలుపు కోసం హామీలను ఇస్తున్నాయి. గత ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి మరింత మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు నాయకులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ పేరు మార్పును తెరమీదకి తీసుకొచ్చారు.

### ఇలా మొదలైంది..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇటీవల అధికారులు ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్ని పార్టీలకు సమాచారం ఇచ్చారు. అయితే డివిజన్ల వారీగా అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇందులో భాగంగానే నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశం ముగిసే సమయంలో బీజేపీ నుంచి హాజరైన నాయకులు నిజామాబాద్‌ను ఇందూరుగా సంబోధించడంతో అక్కడే ఉన్న ఎంఐఎం నాయకులు వ్యతిరేకించారు. దీంతో ఇరు పార్టీల నాయకులు ఇందూరు.. నిజామాబాద్ నినాదాలతో హోరెత్తించారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి స్పందన

నిజామాబాద్‌లో లేవనెత్తిన పేరు మార్పిడిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అర్వింద్ వ్యాఖ్యలను పూర్తిగా ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల పేర్లను మారుస్తామని ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల వేళ నగర పేరు మార్పిడి వ్యవహారం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### మైనార్టీ నాయకుల గుర్రు

బీజేపీ ఎంపీ అర్వింద్ ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేరు మార్పుపై స్పందించారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీ మేయర్ పీఠం కైవసం చేసుకోవడం ఖాయమని, నిజామాబాద్‌ను ఇందూరుగా మారుస్తామంటూ స్పష్టం చేశారు. నిజాంల పేరును విముక్తి చేస్తామంటూ ఘాటుగా చెప్పారు. దీంతో కాంగ్రెస్ మైనారిటీ నాయకులు స్పందించారు. వందల ఏళ్లుగా నిజామాబాద్ పేరు ఉందని మార్పుపై అనవసరంగా మాటలు జారొద్దంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేస్తున్నారు. ఎంపీ అర్వింద్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తున్నారు.



## వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: మంత్రి వివేక్

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. నిజామాబాద్‌లోని నూతన అంబేద్కర్ భవన్‌లో జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో నూతనంగా గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు మరియు వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాలల హక్కులు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల వల్లే మనకు ఈ రాజకీయ అధికారం దక్కిందని వివరించారు. ఈ అధికారాన్ని కేవలం మన కుటుంబాల కోసమే కాకుండా, సమాజం కోసం వాడాలని సూచించారు. గ్రామాల్లో పల్లెల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తానని మంత్రి తెలిపారు. డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేయాలన్నారు. చదువు ఒక్కటే మన జీవితాలను మారుస్తుందని వివరించారు. గ్రామాల్లోని దళిత బిడ్డలు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విదేశీ విద్యానిధి వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు గ్రామ అభివృద్ధికి వెన్నెముక అని తెలిపారు. మీకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు మాల సామాజిక వర్గం ఎంతో కృషి చేసిందన్నారు. నిజామాబాద్ నగరంలో జి.వెంకటస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చిన్నయ్య, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దేవిదాస్, లింబాద్రి, టీఎన్జీవో నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## నగరంలో రూ.60 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల సమగ్ర అభివృద్ధి కోసం రూ.60 కోట్ల నిధులతో పనులు చేపట్టినట్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 60 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు రూ.కోటి చొప్పున కేటాయిస్తున్నామని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. దీంతో నగర రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నగరంలో విద్యుత్ సమస్య రాకుండా ఉండేందుకు రూ. 6 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు తెలిపారు. నగర ప్రజలకు విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ అభివృద్ధిని చూసి కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని కోరారు. నగరంలో మౌలిక సదుపాయాలు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదల, అంతర్గత రోడ్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నట్లు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని అన్నారు. ఈ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నదే మా సంకల్పం అని పేర్కొన్నారు. రూ.60 కోట్లు అనేది కేవలం ప్రారంభం మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నుడా ఛైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, అరికెల నర్సారెడ్డి, నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.




## 'అక్షరటుడే' క్యాలెండర్ ఆవిష్కరణ

**అక్షరటుడే, ఇందూరు:** నేటి డిజిటల్ యుగంలో 'అక్షరటుడే' దినపత్రిక దూసుకెళ్తోందని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో వారు 'అక్షర టుడే' క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు వార్తలకు వేగంగా అందిస్తూ పాఠకుల మన్ననలు పొందుతోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, నుడా ఛైర్మన్ కేశవేణు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అరికెల నర్సారెడ్డి, రాజా నరేందర్ రెడ్డి, బట్టురాజ్, అక్షరటుడే క్రైం రిపోర్టర్ ప్రసాద్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సురేష్ పాల్గొన్నారు.

## కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటాం: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోడిపందేలు, జూదం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం ఉండడంతో నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే ఆయా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టారని తెలియజేశారు. నిరంతర వాహన తనిఖీలు, సరిహద్దు ప్రాంతాల్లో పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని సీపీ తెలిపారు. మహారాష్ట్ర, నిజామాబాద్ సరిహద్దు పోలీస్ స్టేషన్లలో సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని తెలియజేశారు. కోడిపందేలు, జూదం ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పట్టుబడిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకునేందుకు ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను సీపీ కోరారు.

## స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి ఓబన్న



**అక్షరటుడే, ఇందూరు:** స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవని పలువురు వక్తలు కొనియాడారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో ఓబన్న జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను ఎదిరించిన యోధుడు ఓబన్న అన్నారు. రేనాడు ప్రాంతంలో జన్మించిన ఆయన ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జరిపిన పోరులో సైన్యాధ్యక్షుడిగా పనిచేశారని గుర్తు చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, ఆర్టీఏ సభ్యుడు నరేందర్ గౌడ్, ఆయా సంఘాల ప్రతినిధులు దండి వెంకట్, నరాల సుధాకర్, వెంకటేష్, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం: ప్రభుత్వ సలహాదారు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో కోల్డ్ స్టోరేజ్‌ను ఆదివారం ఆయన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోల్డ్ స్టోరేజీ యూనిట్ ప్రారంభంతో రక్త నిల్వ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు మెరుగైన రక్తసేవలు అందించేందుకు కోల్డ్ స్టోరేజ్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో తలసేమియా రోగులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యేలు ప్రశంసించారు. యువతను మరింతగా సేవల్లో భాగస్వామ్యం కల్పిస్తూ ముందుకు వెళ్లాలని వారు సూచించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీకి సుమారు రూ.15లక్షలతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఖర్చు గణనీయంగా తగ్గి, పేద రోగులకు అందించే సేవలు మరింత బలోపేతం అవుతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డా.కవిత రెడ్డి, అరికెల



నర్సారెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు, వైస్ ఛైర్మన్ డొల్లా రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపె రవీందర్, జిల్లా కార్యదర్శి గోక అరుణ్ బాబు, నిజామాబాద్ డివిజనల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీశైలం మ్యానెగింగ్ కమిటీ సభ్యులు డా. నీలి రాంచందర్, సూర్య నారాయణ పాల్గొన్నారు.

చైనామాంజాతో ప్రజలకు, పక్షులకు ప్రాణాంతకంగా మారిన చైనామాంజాను ప్రభుత్వం కొన్నేళ్ల క్రితమే నిషేధించింది. అయినప్పటికీ ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు చైనామాంజా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలువురు వ్యక్తులు చైనామాంజా కోసుకుని గాయాల పాలయ్యారు. అయినప్పటికీ విక్రయాలు జోరుగానే జరుగుతున్నాయి. అధికారులు మాత్రం మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చైనా మాంజా లేకుండా పతంగుల విక్రయాలు జరగడంలేదని బహిరంగంగా చెప్పవచ్చు.

– అక్షరటుడే, నిజామాబాద్ క్రైం

## కిల్లర్ థ్రెడ్..

# జోరుగా చైనా మాంజా విక్రయాలు



■ యువకుల ఉత్సాహాన్ని క్యాష్ చేసుకుంటున్న వ్యాపారులు ■ మొక్కుబడిగా అధికారులు తనిఖీలు చేస్తున్నారని ఆరోపణలు

జిల్లా కేంద్రంలో విచ్చల విడిగా చైనా మాంజా విక్రయాలు జరుగుతున్నాయి. నగరంలోని నెహ్రూ పార్క్, పెద్ద బజార్, పెద్ద పోస్టాఫీస్ కేంద్రాలుగా ఈ మాంజా విక్రయాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఎక్కువగా హోల్‌సేల్ పతంగుల దుకాణాలు ఉన్నాయి.

### చిన్న వ్యాపారులకు..

నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్‌లోని చిన్న పతంగుల వ్యాపారస్తులు జిల్లా కేంద్రం నుంచే కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. పోలీసులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యువత సైతం ఈ మాంజా కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

### పలువురిని అదుపులోకి తీసుకున్నప్పటికీ..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో చైనా మాంజా విక్రయిస్తున్న పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి చైనామాంజాను స్వాధీన పర్చుకున్నప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తూనే ఉన్నారు. మార్కెట్లో కైట్ షాప్‌లలో చైనా మాంజాను బహిరంగంగానే విక్రయిస్తున్నారు. చైనా మాంజాను కట్టడి చేయడంలో సంబంధిత యంత్రాంగం విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు.

### రంగురంగుల పతంగుల సందడి..

రంగురంగుల పతంగుల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో యువకులు, విద్యార్థులు పతంగుల వైపు మొగ్గు చూపుతున్నారు. రంగురంగుల పతంగులను కొనుగోలు చేస్తున్నారు. కాగితం పతంగుల కంటే ప్లాస్టిక్ పతంగులు కొద్దిగా తక్కువ ధరకు లభించడంతో వాటివైపు యువత మొగ్గు చూపుతోంది. గతేడాది కంటే ఈ ఏడాది పతంగుల ధరలు విపరీతంగా పెరిగాయి.

### ఫారెస్ట్ అధికారుల తనిఖీలు

చైనామాంజా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆదివారం ఫారెస్ట్ అధికారులు రంగంలోకి దిగారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలిసిన హోల్‌సేల్ పతంగుల దుకాణాలపై తనిఖీలు చేపట్టారు. చైనా మాంజాను అమ్ముతున్న వారి వివరాలు గురించి ఆరా తీశారు.





## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువకుల ర్యాలీ

**అక్షరటుడే ముప్కాల్:** డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని సంతోష్ ఫౌండేషన్ అధ్యక్షుడు సంతోష్ పేర్కొన్నారు. ఫౌండేషన్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం యువకుల ఆధ్వర్యంలో ముప్కాల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం వల్ల ప్రజల జీవితం నాశనం అవుతుందన్నారు. మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సై కె.కిరణ్ పాల్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో యువకులు ముందుండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగారాం, పోలీస్ సిబ్బంది బ్రహ్మ, సాయి, గ్రామస్థులు, శ్రావణ్, నర్సయ్య, రాకేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి రహిత పాలన కోసం అవకాశం ఇవ్వండి : బీజేపీ మాజీ కౌన్సిలర్లు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీలో అవినీతి రహిత పాలన కోసం ఒకసారి తమకు అవకాశం ఇవ్వాలని బీజేపీ మాజీ కౌన్సిలర్లు పట్టణ ఓటర్లను కోరారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలో రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల అభివృద్ధి చేసి రూ.100 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. గత బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అనేక భూకబ్జాలు జరిగాయని బాధితులు గగ్గోలు పెట్టారన్నారని బీజేపీ మాజీ కౌన్సిలర్లు అన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ప్రజాదర్బార్ పెడితే 5వేల దరఖాస్తులు వచ్చాయంటే భూ కబ్జాలు ఎన్ని జరిగాయో అర్థమవుతుందన్నారు. ఇంకా తమ వద్దకు రాని వాళ్లు చాలామంది ఉన్నారని తెలిపారు. అవినీతి రహిత పాలన కోసం ఎమ్మెల్యేగా వెంకట రమణారెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. అలాగే అవినీతి రహిత, కబ్జాలు లేని కామారెడ్డి కోసం మున్సిపాలిటీ ఎన్నికల్లో తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. గత పాలకవర్గంలో బీజేపీ నుంచి గెలిచిన ఒక్క కౌన్సిలర్ కూడా అవినీతికి ఆస్కారం లేకుండా పని చేశారన్నారు. తమ నాయకుడు వెంకట రమణారెడ్డి గెలిచిన రెండేళ్లలో మున్సిపాలిటీలో అవినీతి జరగకుండా చూశారని బీజేపీ నాయకులు అన్నారు. ప్రస్తుతం ఎలాంటి అవినీతి, భూ కబ్జాలు లేకుండా ప్రజలు ప్రశాంతంగా గుండెమీద చేయి వేసుకుని ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మున్సిపాలిటీని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు సృష్టిస్తోందని ఆరోపించారు. మున్సిపాలిటీలో ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉందని ఆధారాలు చూపించినా అధికారులు పట్టించుకోలేదని బీజేపీ మాజీ కౌన్సిలర్లు అన్నారు. ఎలాంటి సవరణలు చేయకుండా తిరిగి అదే జాబితాను ఇచ్చారన్నారు.



ఓటరు జాబితా తప్పులపై, అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా సోమవారం మున్సిపల్ ముట్టడి చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి బీజేపీ కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్లు ఆకుల సుజిత, మానస, నరేందర్, శ్రీనివాస్, నాయకులు ఆకుల భరత్ తదితరులు పాల్గొన్నారు.



## వీరభద్ర స్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న వీరభద్ర స్వామి ఆలయం, మీసేవ ఆవరణలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా వీరభద్ర ఆలయం, మీసేవ కేంద్రం ఆవరణలో ఉన్న చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న అతి పురాతనమైన వీరభద్ర స్వామి ఆలయం పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. 37 వారాలుగా స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బారడ్ రమేష్, కొక్కుల రమాకాంత్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేద జీడి రాజ్‌కుమార్, గణేష్, చోలా రాకేష్, నూకల ఆదిత్య, కుతాడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ నిర్వహణ అభినందనీయం

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** యువతను క్రీడల్లో ప్రోత్సహించే విధంగా క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమని ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. పెద్దకొడప్‌గల్ మండలంలో ఆదివారం క్రికెట్ టోర్నీని స్థానిక సర్పంచులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. యువకులను నిత్య జీవితంలో క్రీడలలో రాణించే విధంగా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మారుమూల ప్రాంతంలో క్రికెట్ టోర్నీని యువకులు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమన్నారు. సర్పంచ్ బాలాజీ పటేల్ మాట్లాడుతూ ఫైనల్‌లో మొదటి స్థానాల్లో గెలుపొందిన జట్లకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. యువత మాదకద్రవ్యాలు, గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**అక్షరటుడే, ఇందూరు:** డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులను నేర్పిన ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, మహేష్, రవీందర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సతీష్, వినోద్, ప్రవీణ్ చారి, పవన్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి అంటేనే పంతగుల సంబరం..





**అక్షరటుడే, ఇందూరు:** సంక్రాంతి అంటేనే పతంగుల సంబరమని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తీక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం 25వ డివిజన్‌లో చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపమే హిందూ పండుగలు అని అన్నారు. రైతులందరు సంతోషంగా భోగి, సంక్రాతి, కనుమగా మూడు రోజుల పండుగను నిర్వహించుకుంటారన్నారు. చిన్న, పెద్దా అంతా కలిసి సంబరం చేసుకోవడం అనాదిగా వస్తోందన్నారు. ముఖ్యంగా పతంగులు ఎగరేసే క్రమంలో చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు, రహదారులు, ఎత్తైన భవనాల సమీపంలో పతంగులు ఎగరేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు జగదీష్, నిరంజన్, దినేష్, రాకేష్, నాని, చిన్నారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పింఛన్లపై అధికారుల నిర్లక్ష్యం



**అక్షరటుడే, ముప్కాల్:** దివ్యాంగులకు రావాల్సిన పింఛన్లపై మండల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జిల్లా వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పింఛన్ల విషయమై 'సైట్ సమస్య ఉంది' అంటూ అధికారులు తప్పించుకుంటున్నారని, ఆ కారణంతో ఒక్క పింఛన్ కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ పరిస్థితిపై మండల అధికారులను ప్రశ్నించామన్నారు. త్వరలోనే జిల్లా అధికారులను ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలను తెలియజేస్తామన్నారు.

## బీసీ స్టడీ సర్కిల్‌కు సొంత భవనం నిర్మించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌కు సొంత భవనం నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో గల బీసీ స్టడీ సర్కిల్‌ను ప్రభుత్వం అద్భుతంగా నిర్వహిస్తుందన్నారు. ఇందులోని విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాలు సాధించే విధంగా కోచింగ్ ఇస్తున్నారని చెప్పారు. ఎన్నో మంచి ఫలితాలను రాబడుతున్న బీసీ స్టడీ సర్కిల్‌కు సొంత భవనం లేకపోవడం ఇబ్బందికరంగా మారిందన్నారు. స్టడీ సర్కిల్ కోసం సొంత భవనం నిర్మించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో బీసీ స్టడీ సర్కిల్ కోసం గంగాస్థాన్‌లో స్థలం కేటాయించారని పీసీసీ చీఫ్‌కు వివరించారు. కానీ కొన్ని అనివార్య కారణాలతో నిర్మాణం జరగలేదన్నారు. నగరంలో ఉన్న ఆరు బీసీ హాస్టళ్లు విద్యార్థులకు సరిపోవడంలేదని, ఇంకా రెండు బీసీ హాస్టళ్లు మంజూరు చేయించాలని కోరారు. నాయకులు కొయ్యడ శంకర్, కరిపే రవీందర్, మడవేడి వినోద్ కుమార్, నల్లగంటి శ్రీలత, బగ్గలి అజయ్, గుత్ప ప్రసాద్, నల్లగంటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.





## అలోక్ నేషనల్ ప్రీమియర్ అవార్డుకు ఎంపికైన ప్రశాంత్ కుమార్

**అక్షరటుడే, బాన్సువాడ:** హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అలోక్ నేషనల్ ప్రీమియర్ అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సామాజిక విభాగంలో ఉత్తమ సామాజిక కార్యకర్తగా బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన బి.ప్రశాంత్ కుమార్‌ను అవార్డు వరించింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ జబర్దస్త్ నటుడు షేకింగ్ శేషు చేతుల మీదుగా ప్రశాంత్ కుమార్‌కు అవార్డును నిర్వాహకులు అందజేశారు. సమాజసేవలో అందిస్తున్న విశేష సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్‌ను పలువురు అభినందించారు.

## చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని బస్టాప్ వద్ద ప్రయాణికులు బస్సులు ఎక్కుతున్న ప్రయాణికుల నుంచి బంగారు నగలు చోరీ చేస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు గట్టి నిఘా పెట్టారు. ఈ క్రమంలో సీసీ కెమెరా పుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా దీన్ దయాల్ నగర్‌కు చెందిన ఉపాధ్యాయ్ రాణిబాయిని నిందితురాలిగా గుర్తించి ఆమె వద్ద నుంచి మొత్తం 4 తులాలకు పైగా బంగారంను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

